నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | బుధవారం 10 జూలై 2024 | HANUMAKONDA

## కంపు కొడుతున్నా వెళ్లాల్సిందే..!



ఇది మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలోని హైస్కూల్‌లో నిర్మించిన టాయిలెట్ కాంప్లెక్స్. గతేడాది బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు- మన బడి కింద రూ. 7.50 లక్షలతో దీనిని నిర్మించింది. పనులు పూర్తయినా దానికి రంగులు వేయకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు.

### ఇనుగుర్తిలో కొత్త టాయిలెట్స్ ఉన్నా.. పాతవే దిక్కు



ఇది అదే పాఠశాలలో శిథిలావస్థకు చేరుకున్న పాత టాయిలెట్స్. కొత్తది వినియోగంలోకి రాకపోవడంతో విద్యార్థులు దీనినే వినియోగిస్తున్నారు. నిర్వహణ లేక కంపుకొడుతున్నా ఊపిరి బిగపట్టి టాయిలెట్‌కు వెళ్లాల్సి వస్తున్నదని విద్యార్థులు ఆవేదనతో చెబుతున్నారు. – ఇనుగుర్తి, జూలై 9

# సమస్యల బడి

*చిన్న వానకే జలమయమయ్యే పాఠశాల ఆవరణ, అధ్వానంగా పారిశుధ్యం, పెచ్చులూడుతున్న తరగతి గదులు, అమలుకాని సీఎం బ్రేక్‌ఫాస్ట్, పత్తాలేని రెండో జత యూనిఫాం, ఏడు నెలలుగా పెండింగ్‌లో మధ్యాహ్న భోజనం, కోడిగుడ్ల బిల్లులు, వేతనాలు అందక ఐఈఆర్‌పీల ఇబ్బందులు, ప్రాథమిక పాఠశాలల్లో భర్తీ కాని ఎస్‌జీటీ పోస్టులు.. ఇలా సర్కారు బడిని అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. కాంగ్రెస్ సర్కారు అంతులేని నిర్లక్ష్యంతో పాఠశాలల నిర్వహణను గాలికి వదలేయడం విద్యార్థులకు, నిర్వాహకులకు ఇబ్బందిగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దే విద్యాశాఖ ఉన్నప్పటికీ సమస్యలను పట్టించుకోకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ విషయమై మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాయడం అంతటా చర్చనీయాంశమైంది.*

*-జయశంకర్ భూపాలపల్లి, జూలై 9(నమస్తే తెలంగాణ)*

భూపాలపల్లి జిల్లా టేకుమట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ బయట క్యూలో నిల్చున్న విద్యార్థులు, (సర్కిల్‌లో) తాళం వేసి ఉన్న డైనింగ్ హాల్



డైనింగ్ హాల్‌కు తాళం వేయడంతో స్కూల్ ప్రాంగణంలో నేలపై కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు



- పాఠశాలల నిర్వహణ పట్టని సర్కారు
- నిర్లక్ష్యపు నీడలో చదువులు
- విద్యార్థులకు తప్పని అవస్థలు
- అటకెక్కిన పారిశుధ్యం
- పెండింగ్‌లో మధ్యాహ్న భోజన బిల్లులు
- సీఎం బ్రేక్‌ఫాస్ట్‌కు బ్రేక్
- ఒక జత యూనిఫామే దిక్కు
- ఖాళీగా ఎస్జీటీ పోస్టులు
- ఐఈఆర్‌పీలకూ అందని వేతనాలు

### బ్రేక్ ఫాస్ట్ కొనసాగించాలి



పెద్దవంగర, జూలై 9 : గతంలో పాఠశాలల్లో సీఎం బ్రేక్ ఫాస్ట్‌ను ప్రవేశ పెట్టడంతో మాలాంటి నిరుపేద విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేది. పెద్దవంగర ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రావాలంటే ఉదయం ఉప్పరగూడెం గ్రామం నుంచి కాలినడకన, సైకిళ్లపై రావాలి. ఇప్పుడు పదో తరగతి చదువుతున్నాం. మరికొద్ది రోజుల్లో ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ ఉంటాయి. ఇంటి వద్ద తినిరావడం కష్టంగా ఉంటుంది. దీంతో చదువు మీద ఏకాగ్రత పోతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్‌ను కొనసాగించాలి.

*–పెద్ది సాయి చేతన్, పదో తరగతి విద్యార్థి, పెద్దవంగర ఉన్నత పాఠశాల*

### బంగారం కుదువ పెట్టినం



స్టేషన్ ఘన్‌పూర్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి పెట్టిన పెట్టుబడికి మిత్తి కూడా రావడం లేదు. మేం వంట చేసే పాఠశాలలో సుమారు 261 మంది విద్యార్థులున్నారు. వారికి రోజుకు రూ. 1300 వరకు ఖర్చు వస్తున్నది. కోడి గుడ్లు పెట్టిన రోజు రూ. వేయి అదనంగా అవుతున్నయి. నెలకు సుమారు రూ. 50 వేల వరకు ఖర్చు వస్తుంది. పైసలు మాకు వచ్చే వరకు నాలుగు నెలలు పడుతున్నది. పెట్టుబడి కోసం కొందరం మూడు పైసలకు అప్పు తీసుకువస్తే, ఇంకొందరం బంగారం కుదువ పెట్టినం.

*– పులి పద్మ, మధ్యాహ్న భోజన కార్మికురాలు, స్టేషన్ ఘన్‌పూర్*

### పెండింగ్‌లో గౌరవ వేతనాలు, మధ్యాహ్న భోజన బిల్లులు

భూపాలపల్లి జిల్లాలోని 410 పాఠశాలల్లో 711 మంది కుక్‌లు, హెల్పర్‌లు పనిచేస్తున్నారు. వారికి రాష్ట్రప్రభుత్వం రూ.2000, కేంద్రప్రభుత్వం రూ.1000 చొప్పున నెలకు రూ.3 వేలు గౌరవ వేతనం అందిస్తుంది. 711 మందికి నెలకు రూ. 21.33 లక్షలు గౌరవ వేతనాలు అందిస్తున్నారు. అయితే జనవరి నుంచి వీరికి గౌరవ వేతనం పెండింగ్‌లో ఉంది. అంటే రూ.1.27 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా అధికారులు మాత్రం రూ.30లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే అందిస్తామని చెబుతున్నారు. అలాగే తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు సంబంధించి నాలుగు నెలల మధ్యాహ్న భోజన, ఎగ్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకటవ తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు రూ.46.73లక్షలు మధ్యాహ్న భోజన బిల్లులు, రూ.14.61 లక్షలు కోడిగుడ్ల బిల్లులు వచ్చాయని అధికారులు పేపర్ లెక్కలు చెబుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం విద్యార్థులకు పాఠశాలలోనే అల్పాహారం అందించాలని సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీంతో జిల్లాలోని 15 పాఠశాలల్లో పథకం మొదటి విడతగా అమలు చేయగా సుమారు 800 మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకున్నారు. ప్రస్తుతం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని సర్కారు బ్రేక్ చేసింది.

#### ఖాళీగా ఎస్జీటీ పోస్టులు

ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇచ్చిన నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఒక్క భూపాలపల్లి జిల్లాలోనే 250 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కాగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్ పూర్తయ్యేలోగా విద్యార్థులకు విద్యా వాలంటీర్లచే విద్యాబోధన చేయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. సర్వశిక్షా అభియాన్, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ల(ఐఈఆర్‌పీ) వేతనాలు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా లో 22 ఐఈఆర్‌పీ సాంక్షన్ పోస్టులు ఉండగా ప్రస్తుతం 19మంది పనిచేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1829 ఉపాధ్యాయ సాంక్షన్ పోస్టులకు 1404 మంది పని చేస్తుండగా 425 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

#### ఒకే జత యూనిఫాం దిక్కు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అధికారులు ఒక జత యూనిఫాం అందించి చేతులు దులుపుకొన్నారు. మొత్తం 20,923 జతల యూనిఫాంలు అందించారు. భూపాలపల్లి మండలంలోని పాఠశాలల విద్యార్థులకు 3674, చిట్యాలలో 2033, గణపురంలో 1726, కాటారంలో 1939, మహదేవపూర్‌లో 2379, మల్హర్‌లో 1596, మొగుళ్లపల్లిలో 1743, మహాముత్తారంలో 1942, పలిమెలలో 620, రేగొండలో 1865, టేకుమట్లలో 1406 జతల యూనిఫాం అందించారు. రెండో జత బట్టలకు ఇప్పటికీ దిక్కు లేదు.


### మధ్యాహ్న భోజనం.. బకాయిల భారం

- నెలల తరబడి బిల్లులు విడుదల చేయని ప్రభుత్వం
- పెరిగిన కూరగాయలు, గుడ్ల ధరలతో అవస్థలు
- నిర్వహణ కష్టమై ఇబ్బందులు పడుతున్న ఏజెన్సీలు

గిర్మాజీపేట: తమకు రావాల్సిన బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి నిధులు కేటాయించకపోవడంతో ఆర్థికంగా భారమవుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రూ. 5.45, ఆరు నుంచి ఎనిమిది వరకు రూ. 8.17, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు రోజుకు ఒక్కొక్కరికి రూ. 10.67 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు గౌరవ వేతనం రూ. 10 వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. పెంచిన వేతనం మాట అటుంచితే, గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రూ.3వేలు కూడా అం దించడం లేదని ఏజెన్సీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, సర్వశిక్షా అభియాన్, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ)లకు మే వరకే జీతాలు అందాయి. గతంలో పాఠశాలల్లో పారిశుధ్య పనులను జీపీ సిబ్బంది చూడగా, ప్రస్తుతం ఆ బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించడంతో నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. పేద విద్యార్థుల ఆకలి తీర్చే సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఆగిపోయింది.



భీమదేవరపల్లి : కిచెన్ షెడ్‌లేక ఆరుబయట కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు



మహదేవపూర్: శిథిలావస్థలో ఉన్న పాఠశాల తరగతి గది





కృష్ణకాలనీ: జంగేడు ఎంపీపీఎస్‌లో పిచ్చిమొక్కల నడుమ ఉన్న హ్యాండ్‌వాష్, మరుగుదొడ్డి (ఇన్‌సెట్) పాఠశాల ఆవరణలో తిరుగుతున్న పాము

### బిల్లులు ఎప్పుడు పడుతున్నయో తెల్వడం లేదు



ఖానాపురం, జూలై 9 : ఖానాపురం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నాను. మాకు రూ. 3 వేల గౌరవ వేతనం ఏప్రిల్ వరకు చెల్లించారు. మధ్యాహ్న భోజన బిల్లులు కూడా ఏప్రిల్ వరకు తీసుకున్నం. అయితే ప్రభుత్వం ఎప్పుడు బిల్లులు వేస్తుందో తెల్వడం లేదు. కోడిగుడ్ల బిల్లులు జనవరి వరకు ఇచ్చారు. కోడిగుడ్డుకు ప్రభుత్వం రూ.5 మాత్రమే చెల్లిస్తున్నది. బయట రూ.6 నుంచి రూ.6.50 వరకు ధర ఉంది. దీంతో మాకు ఏమీ మిగలడం లేదు. ప్రభుత్వం బిల్లులన్నీ ఒకేసారి చెల్లించాలి.

*–నీలపొంగు కొమురమ్మ, మధ్యాహ్న భోజన కార్మికురాలు, ఖానాపురం*

### అప్పు చేసి భోజనం పెడుతున్నం



ప్రభుత్వం మధ్యాహ్న భోజనం బిల్లులు అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నం. ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే సరఫరా చేస్తుంది. అప్పులు చేసి మిగతా సరుకులు కొనుగోలు చేస్తున్నం. కోడిగుడ్డు బిల్లులు జనవరి వరకు మాత్రమే వచ్చాయి. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, జూన్ నెలలకు రాలేదు. గత ప్రభుత్వం రూ.3 వేల గౌరవ వేతనం డిసెంబరు వరకు ఇచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం జనవరి నుంచి ఇవ్వలేదు. కార్మికులకు రూ.10 వేల గౌరవ వేతనంతో పాటు కోడిగుడ్లు, వంట సరుకులు ప్రభుత్వమే సరఫరా చేయాలి.

*– బాలెన వరలక్ష్మి, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు, గణపురం*

### పది నెలల నుంచి కోడిగుడ్ల బిల్లులు రావడం లేదు



ధర్మసాగర్, జూలై 9 : మేము ధర్మసాగర్ జడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండుతున్నం. ఈ పాఠశాలలో 9, 10వ తరగతులకు చెందిన వారికి కోడిగుడ్లు వారానికి మూడు చొప్పున పెట్టాం. వీటికి పది నెలల నుంచి బిల్లులు రాలేదు. సార్‌ను అడిగితే వస్తాయి అంటున్నడు. ఇంక ఎంతగనమని పెట్టుబడి పెట్టాలి. సార్లు మమ్మల్ని అర్థం చేసుకోవడం లేదు. రూ. 3 వేల గౌరవ వేతనం కూడా రాలేదు. ముందుస్తుగా పెట్టుబడి పెట్టలేక ఇబ్బందులు పడుతున్నాం. మాకు ఇప్పటికైనా నెల నెలా బిల్లులు ఇవ్వాలి.

*– ల్యాగ విజయ, స్ఫూర్తి మహిళా సంఘం సభ్యురాలు, ధర్మసాగర్*

## 'డబుల్' ఇండ్ల కోసం ట్యాంకెక్కి నిరసన

- అధికారులు ఖాళీ చేయాలంటున్నారన్న లబ్ధిదారులు
- ఎమ్మెల్యే పట్టాలిస్తేనే దిగుతామని స్పష్టం
- తహసీల్దార్ హామీతో ఆందోళన విరమణ

దేవరుప్పుల, జూలై 9: ఎస్సీకాలనీలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో తాము 10 నెలలుగా ఉంటున్నామని, అధికారులు ఖాళీ చేయాలని వేధిస్తున్నారని మంగళవారం లబ్ధిదారులు వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. ఉప్పుల నరేశ్, ఆయన భార్య ఉపేంద్ర, ఇద్దరు పిల్లలు మహీధర్, మహోదయ్‌తో పాటు జోగు నరేశ్, చింత కిష్టయ్య, చింత సోమయ్య ట్యాంకు ఎక్కి తమకు స్థానిక ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ఇండ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇస్తేనే దిగుతామని స్పష్టం చేశారు. పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు సర్ది చెప్పినా వినలేదు. చివరగా తహసీల్దార్ హుస్సేన్ తాను కలెక్టర్ రిజ్వాన్ బాషా వద్దకు తీసుకుపోతానని, సమస్య తీవ్రత తెలిపి పట్టాలిప్పిస్తానని తెలపడంతో ఆందోళన విరమించారు. కాగా, కాంగ్రెస్ నాయకులు ఒత్తిడి చేయడంతోనే అధికారులు ఇండ్లు ఖాళీ చేయాలంటున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.



దేవరుప్పులలో వాటర్ ట్యాంక్‌పై డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

### అర్హులైతే వారికే ఇండ్లు

#### ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

దేవరుప్పులలోని డబుల్ బెడ్‌రూం ఇండ్లకు ఎలాంటి గ్రామ సభ పెట్టకుండా అందులో ఉంటున్నారనే విషయం నా దృష్టికి వచ్చింది. అధికారులు గ్రామసభ నిర్వహించి ప్రజల సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేస్తే అధికారికంగా పట్టాలు వస్తాయి. ప్రస్తుతం ఉంటున్న వారు అర్హులైతే వారికే ఇండ్లు వస్తాయి. గ్రామసభలో ఎంపిక కాకపోతే మరో లబ్ధిదారుకు చెందుతాయి. ఇంకా అర్హులు మిగిలితే ప్రభుత్వం అందిస్తున్న ఇండ్లలో మొదటి ప్రాధాన్యత ఉంటుంది. ప్రతి అర్హుడికి ఇల్లు అందించే బాధ్యత తీసుకుంటా.

### ఖాళీ చేయిస్తే బజారున పడ్తం



మా కుటుంబానికి ఉండడానికి గుడిసె లేదు. ఎంతో కష్టపడితే ఇల్లు వచ్చింది. కూలీనాలీ చేసి కట్టుకున్నం. ఎమ్మెల్యే కాళ్లు మొక్కుతం. అధికారులకు చెప్పండి. ఖాళీ చేయిస్తే బజారున పడుతం. మూడు నెలల నుంచి నిద్రపోనిస్తలేరు. కరెంటు, నీళ్లు రాకుండ చేస్తుండ్రు. చాలా ఇబ్బందులు పెడుతుండ్రు. ఇండ్లు ఖాళీ చేయాలని అధికారులు, పోలీసులు వస్తుండ్రు.

*– వంగాల యాదమ్మ, లబ్ధిదారు*

## వ్యాపార రంగంలో మహిళలకు ప్రోత్సాహం

- ఉపాధి కోసం రూ.20వేల కోట్ల రుణాలు
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్

ములుగురూరల్, జూలై 9 : వ్యాపార రంగంలో గ్రామీణ మహిళలు రాణించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్, క్యాంపు కార్యాలయం వద్ద మంత్రి సొంత నిధులతో జిమ్‌ను ఏర్పాటు చేయగా మంగళవారం ఎంపీ పోరిక బలరాంనాయక్, కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీతో మంత్రి కలిసి ప్రారంభించారు. ములుగు నుంచి పత్తిపల్లి వరకు దేవగిరిపట్నం మీదుగా రూ. 6.56 కోట్లతో 5.5 కిలోమీటర్ల మేర చేపడుతున్న రోడ్డు పునరుద్ధరణ పనులు, కలెక్టరేట్‌లో దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లకు రూ.50వేల చొప్పున ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. మహిళలకు ఉపాధి కల్పించేందుకు రూ. 20వేల కోట్ల రుణాలను బ్యాంకు లింకేజీ ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించనున్నట్లు చెప్పారు. రానున్న ఐదేళ్లలో మహిళల ఆర్థికాభివృద్ధి పెంపొందించేందుకు వడ్డీలేని రుణ సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే వస్తువులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, లేకపోతే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున రిటైర్మెంట్ సమయంలో సాయం అందించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైల్ డిప్యూటీ సీఎం వద్ద ఉందన్నారు. ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకం మంత్రి సీతక్క ద్వారా ములుగు ప్రాంతంలో మొట్టమొదటి సారిగా ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇంచర్ల గ్రామానికి చేరుకొని ఫంక్షన్ హాల్‌లో 50మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్డీవో శ్రీనివాస్‌కుమార్, డీడబ్ల్యూవో స్వర్ణలతలెనినా పాల్గొన్నారు.

## అడవిలో చిక్కుకున్న యువకులు సురక్షితం



గ్రామానికి చేరుకున్న యువకులతో పోలీస్, రెవెన్యూ సిబ్బంది

మంగపేట, జూలై 9 : షికారు కోసం అడవికి వెళ్లి దారి తప్పిన ఇద్దరు యువకులు ఎట్టకేలకు సురక్షితంగా ఇంటికి చేరారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కమలాపురానికి చెందిన దినేశ్, రేసెన్ సోమవారం సాయంత్రం గ్రామ సమీపంలోని అడవిలోకి షికారుకు వెళ్లారు. భారీ వర్షం కురియడంతో ఎర్రవాగు ప్రవాహం పెరిగింది. మరోవైపు చీకటి పడింది. దీంతో వారు వంతెన వద్దకు చేరుకునే తోవను మర్చిపోయి ఆందోళనలో పడ్డారు. ఈక్రమంలో 100కు డయల్ చేసి అడవిలో తోవ తప్పిన విషయాన్ని తెలిపారు. వెంటనే ఎన్‌డీఆర్ఎఫ్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది కమలాపురానికి చేరుకొని ఎర్రవాగు వంతెన మీదుగా అటవీ ప్రాంతానికి వెళ్లారు. వారి ఆచూకీ తెలుసుకొని గ్రామానికి సురక్షితంగా తీసుకురావడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.




నిర్మాణం పూర్తయిన సీసీరోడ్డు

## ఆ ఊరికి 40 ఏళ్లకు రోడ్డొచ్చింది

- ఫ్రూట్‌ఫారమ్ గ్రామానికి పూర్తయిన సీసీ రోడ్డు
- రూ. 1.80 కోట్లు మంజూరు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

గోవిందరావుపేట, జూలై 9 : నలభై ఏళ్ల స్వప్నం సాకారమైంది. ఫ్రూట్‌ఫారమ్ గిరిజన గూడేనికి వెళ్లేందుకు రూ. 1.80 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. నిధులు మంజూరు చేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామ పంచాయతీ పరిధిలోని ఫ్రూట్ ఫారమ్ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. ఈ విషయమై గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు అప్పటి ఐటీడీఏ అధికారుల చుట్టూ తిరిగినా లాభం లేకుండా పోయింది. ఏటా వానకాలం వస్తే ఆ గ్రామానికి ఇతర ప్రాంతాలతో సంబంధాలు ఉండేవి కావు. దయ్యాల వాగు ఉప్పొంగితే రహదారిపై గండ్లు పడి మరింత ఇబ్బందిగా ఉండేది. నలభై ఏళ్లుగా వారు ఈ బాధలను అనుభవిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో చల్వాయి సర్పంచ్‌గా ఉన్న ఈసం సమ్మయ్య దివంగత జడ్పీ మాజీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. గత మంత్రి సత్యవతిరాథోడ్‌ను సైతం గ్రామానికి తీసుకెళ్లి రోడ్డు సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో సత్యవతిరాథోడ్ ఐటీడీఏకు లేఖ రాయడంతో ట్రైబల్ సబ్‌ప్లాన్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ నిధుల నుంచి రూ. 1.80 కోట్లు విడుదల చేశారు. జాతీయ రహదారి నుంచి ఫ్రూట్‌ఫారమ్ వరకు రోడ్డు ఎత్తు లేపడంతో పాటు దయ్యాల వాగు సమీపంలో బండ్ ఏర్పాటు చేసి 1300 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించడంతో గ్రామస్తులు సంబురం వ్యక్తం చేస్తున్నారు.

### రోడ్డు కోసం ఇబ్బందులు పడ్డం



మా గ్రామంలో సుమారు 33 గిరిజన కుటుంబాలున్నాయి. 150 మంది జనాభా కలిగిన ఈ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఎన్ని సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రోడ్డు వేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. చల్వాయి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన తర్వాత నేను బీఆర్ఎస్ పార్టీలో చేరి అప్పటి మంత్రి సత్యవతి రాథోడ్, దివంగత జడ్పీ మాజీ చైర్మన్ జగదీశ్వర్ సహకారంతో రోడ్డు నిర్మించుకోవడం సంతోషంగా ఉంది.

*– ఈసం సమ్మయ్య, మాజీ సర్పంచ్, చల్వాయి*